ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



తూర్పుగోదావరి

16

ఆదివారం 25 ఫిబ్రవరి 2018


# జేఎన్టీయూది ఘన చరిత్ర

- టెక్‌ఫెస్ట్ ప్రారంభోత్సవంలో జేఎన్టీయూకే రెక్టార్ పూర్ణానందం




సాంకేతిక సింపోజియం బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ముఖ్యఅతిథులు

**జేఎన్టీయూకే, ఫిబ్రవరి 24:** కాకినాడ జేఎన్టీయూలోని యూసీఈకే (యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ కాకినాడ)కు 72 ఏళ్ల ఘనచరిత్ర కలదని వర్సిటీ రెక్టార్ ప్రొఫెసర్ కె.పూర్ణానందం తెలిపారు. వర్సిటీ ప్రాంగణంలో రెండు రోజులపాటు ఈఈఈ, సివిల్ ఇంజనీరింగ్, ఈసీఈ విభాగాల ఆధ్వర్యంలో నిర్వహించే జాతీయస్థాయి సింపోజియం టెక్ ఫెస్ట్ 2కె18ను రెక్టార్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈఈఈ ఫెస్ట్‌ను ఎన్‌కర్సోగానూ, సివిల్ ఇంజనీరింగ్ ఫెస్ట్‌ను సౌధగానూ, ఈసీఈ ఫెస్ట్‌ను ఈస్పార్క్స్‌గానూ వ్యవహరిస్తున్నారు. ప్రారంభోత్సవంలో గౌరవ అతిథులుగా రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వీవీ సుబ్బారావు, యూసీఈకే ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జీవీఆర్ ప్రసాదరాజు పాల్గొన్నారు. ఈసందర్భంగా రెక్టార్ మాట్లాడుతూ విద్యార్థులు ఫెస్ట్‌లలో ఎక్కువగా పాల్గొని నూతన సాంకేతిక పోకడలగూర్చి తెలుసుకుని సమాజానికి ఉపయోగపడే ఆవిష్కరణలపై దృష్టిసారించాలన్నారు. టెక్‌ఫెస్ట్‌ల బ్రోచర్లను ముఖ్య అతిథుల చేతులమీదుగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో విభాగాధిపతులు డాక్టర్ స్వరూపరాణి, ప్రొఫెసర్ పద్మప్రియ, డాక్టర్ మురళీమోహన్, ఫ్యాకల్టీ కోఆర్డినేటర్లు డాక్టర్ మూర్తి, సమీమ్‌భాను, డాక్టర్ రమాదేవి, ప్రోగ్రాం డైరెక్టర్లు, అధ్యాపకులు, స్టూడెంట్ కోఆర్డినేటర్లు, అనుబంధ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆకట్టుకున్న ఇంజనీరింగ్ విద్యార్థుల ప్రాజెక్టులు

కాకినాడ జేఎన్టీయూ ప్రాంగణంలో ఈసీఈ, ఈఈఈ, సివిల్ ఇంజనీరింగ్ విద్యార్థులు నిర్వహించిన జాతీయస్థాయి సాంకేతిక సింపోజియం టెక్ ఫెస్ట్‌లో సంబంధిత విభాగాల ఇంజనీరింగ్ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. యూసీఈకే, వర్సిటీ అనుబంధ కళాశాలల నుంచి విచ్చేసిన విద్యార్థులు పలు అంశాలలో ప్రదర్శించిన ప్రాజెక్టులు ఆకట్టుకున్నాయి. విద్యార్థులు పేపర్ ప్రజంటేషన్, పోస్టర్ ప్రజంటేషన్, ప్రాజెక్టు ఎక్స్‌పో, ఎక్స్‌ప్రెస్, మొబైల్ మేకింగ్, గోసోలార్ వర్క్‌షాప్‌లు, ప్రాజెక్టులు ప్రదర్శించారు. విద్యార్థుల ప్రదరించిన ప్రాజెక్టులు ఏవిధంగా పనిచేస్తాయో వారి మాటల్లోనే..



### మహిళల ఆపదలో రక్షణకు..

**- భానులలిత, భాగ్యశ్రీ, తేజస్వీని, ఈసీఈ, జీవీపీ మహిళా ఇంజనీరింగ్ కళాశాల**

200 ఓల్ట్స్‌తో తయారుచేసిన గ్లౌస్‌ను ధరించడం ద్వారా ఒక వేరియబుల్ డివైస్‌ను యాప్ ద్వారా బటన్ నొక్కితే ఆపదలో ఉన్న మహిళలు ఆత్మరక్షణ పొందేందుకు తాము కనిపెట్టిన 'ఉమెన్ సెక్యూరిటీ సిస్టం' ఉపయోగ పడుతుందన్నారు. దీనిద్వారా సంబంధిత పోలీస్, కుటుంబ సభ్యులకు సమాచారం వెళుతుందని తెలిపారు.



### ఆధునిక అక్వేరియం

**ఈశ్వర్ మణికంఠ, కౌషిక్, రవికిరణ్, రాజు, ఈఈఈ, జీఎమ్మార్ఐటీ**

సాధారణంగా అక్వేరియంల మెయింటెనెన్స్‌కు ఎక్కువ ఖర్చు అవుతుందని తాము తయారుచేసిన ఆర్డినో అనే మైక్రోకంట్రోలర్ వాడటం ద్వారా తక్కువ ఖర్చుతో ఎంతపెద్ద అక్వేరియంనైనా నిర్వహించవచ్చని తెలిపారు.

### అపార్ట్‌మెంట్ల నిర్మాణం ద్వారా నగర అభివృద్ధి

**శ్రీనివాస్, రోహిత్, మణికంఠ, సివిల్, ప్రగతి ఇంజనీరింగ్ కళాశాల**

నదులు, సముద్రతీర ప్రాంతాలు, వ్యవసాయ భూములు ఇండివిడ్యువల్ భవనాల నిర్మాణం కారణంగా తగ్గిపోతున్నాయని వాటిని సంరక్షించాలంటే ఆధునిక సాంకేతికతతో అపార్ట్‌మెంట్లు నిర్మించి అందరూ వాటిలో నివసించేలా చేయాలని తమ ప్రాజెక్టు ద్వారా వివరించారు.

